క్లుప్తంగా

విజయరాజుకు సత్కారం



తాళ్లపూడిలో విజయరాజును సత్కరిస్తున్న దళిత జేఏసీ నాయకులు

తాళ్లపూడి: రాష్ట్ర వైఎస్సార్ సీపీ పబ్లిసిటీ వింగ్ జనరల్ సెక్రటరీగా ఎంపికైన గూడా విజయ రాజును తాళ్లపూడిలో ఆదివారం మండల వైఎస్సార్ సీపీ దళిత జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అదే విధంగా ఆయన పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి యాళ్ల బాబురావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, దళిత జేఏసీ నాయకులు గండి రాంబాబు, సిర్రా గంగారావు, కొల్లి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మకు ప్రత్యేక పూజలు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి విశేషంగా వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోలు అమ్మకంతో రూ.1,84,316 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్య ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బంక అప్పారావుకు అభినందనలు



అప్పారావును అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నల్లజర్ల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బంక అప్పారావును ఆదివారం పలువురు నాయకులు అభినందించారు. అనంతపల్లిలోని ఆయన స్వగృహంలో వైఎస్సార్ సీపీ నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు బళ్ళనాని, ప్రత్తి మురళీ, చిట్లా వెంకటేశ్వరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు జాదుల దుర్గారావు, కొమరాపు శ్రీను తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

తాళ్లపూడి: యువత దేశ భక్తితో మెలగాలని, దేశం పట్ల నిజమైన ప్రేమ చూపాలని చిలకురి రాధాకృష్ణ అన్నారు. మండలంలోని వేగేశ్వరపురంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ శాఖ ఏర్పడి వంద ఏళ్లు అయిన సందర్భంగా గ్రామంలోని తుమాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో సంచలనం (కవాతు) నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ ప్రముఖులు చిలకురి రాధాకృష్ణ, చిలకమర్తి శేషగిరి శర్మలు ప్రసంగించారు. అడ్డా శ్రీరామ్ మోహన్, బొర్రా శ్రీ రామమూర్తి, మండల బీజేపీ అధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో అగ్ని ప్రమాదం

దేవరపల్లి: దేవరపల్లిలోని పాత టైర్ల దుకాణంలో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. టైర్ల దుకాణానికి సమీపంలో ఉన్న పశువుల పాకలో పాములను తరిమికొట్టేందుకు పొగపెట్టారు. గాలి ఉధృతికి మంటలు ఎగసిపడి పాత టైర్ల దుకాణంలోకి వ్యాపించడంతో టైర్లు దగ్ధమయ్యాయి. దుకాణంలోని కారు పాక్షికంగా కాలినట్టు ఆ దుకాణం యజమాని తెలిపారు. కొవ్వూరు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలను అదుపు చేశారు.

పుట్టిన రోజు వేడుకల్లో తలారి



చిన్నారిని ఆశీర్వదిస్తున్న తలారి వెంకట్రావు

చాగల్లు: మండలంలో మీనానగరంలో పార్టీ నాయకుడి ఇంట జరిగిన పుట్టిన రోజు వేడుకలకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్చార్జి తలారి వెంకట్రావు హాజరయ్యారు. ఆదివారం చాగల్లు ఉప సర్పంచ్ మేకా రాజు మనవడి పుట్టిన రోజు సందర్భంగా తలారి వెంకట్రావు ఆ చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, ఎంపీపీ మట్టా వెంకట్రావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, నాయకులు బొర్రా రజనీప్రసాద్, జాలెం వెంకట్రావు, బొర్రా కృష్ణ, అయినం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డబ్బుల డ్రాగన్

- డ్రాగన్ ఫ్రూట్ సాగుపై రైతుల ఆసక్తి
- ఎకరాకు సుమారు రూ.10 లక్షల పెట్టుబడి
- ఒక్కసారి వేస్తే 20 ఏళ్ల వరకు ఏటా ఆదాయం

తాళ్లపూడి: సంప్రదాయ పంటలకు సస్తి చెప్పి తమకు లాభాలను, ప్రజలకు ఆరోగ్యాన్ని తెచ్చిపెట్టే డ్రాగన్ ఫ్రూట్ వంటి పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. సరికొత్త ఆలోచనలతో వినూత్న పద్ధతుల్లో పంటలను సాగు చేస్తున్నారు. మంచి పోషకాలు ఉండడంతో పాటు మార్కెట్లో వీటికి మంచి డిమాండ్ ఉండడం, దీర్ఘ కాలం పాటు పెట్టుబడి పెట్టనవసరం లేకపోవడం పైగా ఆదాయం కూడా ఎక్కువ వస్తుందని రైతులు చెబుతున్నారు. కొవ్వూరు నియోజకవర్గంలోని కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లో సుమారు 10 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ పంటను రైతులు సాగు చేస్తున్నారు. రైతులకు లాభదాయకంగా ఉండటంతో రైతులు ఉత్సాహంగా సాగు చేస్తున్నారు.

ఏటా నాలుగు సార్లు చేతికి పంట

ఎకరం పొలంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేయడానికి రూ.10 లక్షలు వరకు పెట్టుబడి అవుతుంది. పందిరి, ఫెన్సింగ్, ఎరువులు తదితర వాటికి ఈ ఖర్చు అవుతంది. అయితే ఒక్క సారి వేస్తే 20 సంవత్సరాల వరకు పంట వస్తుంది. ఏడాదిలో మూడు నుంచి నాలుగు సార్లు పంట కాస్తుంది. ఎకరాకు 10 టన్నుల పంట దిగుబడి వస్తుంది. మార్కెట్లో రైతుల వద్ద ప్రస్తుతం కేజీ డ్రాగన్ ఫ్రూట్ రూ.70 నుంచి రూ.80 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఖర్చులు పోగా ఏడాదికి రూ.నాలుగు నుంచి ఐదు లక్షల వరకు ఆదాయం వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో విడిగా అయితే కేజీ రూ.120 నుంచి రూ.150 వరకు అమ్మకాలు చేస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్ తినడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని డాక్టర్లు, పోషకాహార నిపుణులు చెబుతున్నారు. దీంతో ప్రజలు వాటిని తినేందుకు మొగ్గు చూపుతున్నారు.

పోషకాలు అధికం

డ్రాగన్ ఫ్రూట్ విటమిన్-సి, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లతో నిండి ఉంటుంది. ఇది శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా గుండె ఆరోగ్యానికి సహాయ పడుతుంది. అధిక ఫైబర్ కంటెంట్ పేగు కదలికలను క్రమబద్ధీకరించి, జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. ఇది తక్కువ కేలరీలు కలిగి ఉండి, శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. ఇనుము, కాల్షియం వంటి ఖనిజాలను కూడా అందిస్తుంది.



రావూరుపాడులో సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్

● గుండె ఆరోగ్యానికి మంచిది

డ్రాగన్ ఫ్రూట్ మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) ను పెంచి, చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) ను తగ్గించే సమ్మేళనాలను కలిగి ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

● రక్తంలో చక్కెర స్థాయి నిర్వహణ

డయాబెటిస్ ఉన్నవారికి తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ (ఎఐ), అధిక ఫైబర్ కంటెంట్ కారణంగా ప్రయోజనకరంగా ఉంటుంది.



రావూరుపాడు నుంచి మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు సిద్ధం చేస్తున్న పండ్లు

అధిక నీటి శాతం

డ్రాగన్ పండు శరీరానికి హైడ్రేషన్ అందిస్తుంది. వేడి వాతావరణంలో శరీరాన్ని చల్లబరుస్తుంది. విటమిన్-సితో పాటు, విటమిన్ బి6, ఇనుము, కాల్షియం, మెగ్నీషియం, పాస్ఫరస్ వంటి ఖనిజాలను కూడా అందిస్తుంది. దీంతో డ్రాగన్ ఫ్రూట్ తినాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

పంట లాభసాటిగా ఉంది



2019లో డ్రాగన్ ఫ్రూట్ ఎకరంలో సాగు చేపట్టాం. తరువాత ఏడాది నుంచి కాపునకు వచ్చింది. కరోనా సమయంలో నేరుగా పొలానికి వచ్చి ప్రజలు కొనుగోలు చేశారు. తరువాత నుంచి మార్కెట్‌కు తరలిస్తున్నాం. ఏడాదికి నాలుగు సార్లు కాపు కాస్తుంది. సుమారు 10 టన్నులు వరకు దిగుబడి వస్తుంది. ఎకరానికి పందిరి, ఇతర ఖర్చులు రూ.10 లక్షలు వరకు అవుతున్నాయి.

– కొలిశెట్టి నాగేశ్వరావు, రైతు, రావూరుపాడు.

తెలికిచెర్లలో 'జక్కంపూడి' జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేసిన మాజీ హోంమంత్రి వనిత



తెలికిచెర్లలో కేక్ కట్ చేస్తున్న మాజీ హోంమంత్రి తానేటి వనిత

నల్లజర్ల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా జన్మదినోత్సవాన్ని ఆదివారం తెలికిచెర్లలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ హోం మంత్రి తానేటి వనిత హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బంక అప్పారావు, గోపాలపురం నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నక్కాపండు, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు అందుగుల వెంకటేశ్వరావు, చిక్కాలనాగేశ్వరావు, చిట్లా వెంకటేశ్వరావు, బోడిగడ్ల నజరానరావు, నల్లారాజు, బండి పెదనాగరాజు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

నిడదవోలు: పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలో నిడదవోలు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ గుంటుపల్లి శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో ఆదివారం రోగులకు వారి సహాయకులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మీసాల శివరామ హరిప్రసాద్, కార్యదర్శి దారపురెడ్డి ప్రతాప్, గోపిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాలను ప్రజలకు వివరించండి



యాదవోలులో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్

దేవరపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మోసాలను ప్రజలకు వివరించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. యాదవోలులో ఆదివారం రాత్రి గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎలికే నాగశ్రీను అధ్యక్షతన జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ఏడాది తర్వాత మొక్కుబడిగా అమలు చేస్తున్నారని ఆయన అన్నారు. ప్రచార ఆర్భాటం తప్ప అభివృద్ధి లేదని ఆయన విమర్శించారు. ఎన్నికల్లో కూటమి మాయమాటలు విని మోసపోయామని ప్రజలు గ్రహించారని ఆయన అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆరేటి సూర్యనారాయణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. మాజీ హోంమంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత నాయకత్వంలో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కష్టపడి పని చేసి పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సున్నం నాగవరప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి మేడిబోయిన గంగరాజు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి సత్తి సాయి ఈశ్వర రెడ్డి, పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కుసులూరి వెంకటసతీష్, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు సత్తి జగదీశ్వరరెడ్డి, నియోజకవర్గ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎస్కే ముస్తాఫా, యువజన విభాగం మండల అధ్యక్షులు అనిశెట్టి సూర్యచంద్రం, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అన్నీ మోసాలు, అరాచకాలే

చాగల్లు: చంద్రబాబు ఎన్నికల సమయంలో అబద్దపు హామీలు ఇచ్చి మరోసారి ప్రజలను మోసం చేశారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆరోపించారు. బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం చిక్కాలలో గ్రామసభ నిర్వహించారు. సభకు సర్పంచ్ కొయ్యే మణి అధ్యక్షత వహించారు. ఈ సభలో చంద్రబాబు 15 నెలల పాలనలో అరాచకాలు, మోసాలను వివరించారు. తలారి వెంకట్రావు మాట్లాడుతూ, చంద్రబాబు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరుతో వారిని దగా చేశారన్నారు. తల్లికి వందనం పేరుతో ప్రజలను వంచన చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో 87 లక్షల మంది తల్లులు ఉంటే 54 లక్షల మందికి మాత్రమే ఈ పథకం ఇచ్చారన్నారు. అదే విధంగా రాష్ట్రంలో వైద్యం, వ్యవసాయ రంగాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, ఆరోగ్యశ్రీని అటకెక్కించిందని, రైతన్నలకు పెట్టుబడి సాయం అందించకుండా అప్పుల పాలు చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దాదాపు ఏడు లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ ఎగ్గొటారని ఆరోపించారు. నాలుగేళ్లలో కేవలం మహిళలకు సుమారు రూ.8 వేల కోట్లు మాత్రమే కూటమి ప్రభుత్వం కేటాయిస్తుండగా.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళలకు వివిధ పథకాల ద్వారా సుమారు రూ.1.26 లక్షల కోట్లు అందించిందని గుర్తు చేశారు. ఎంపీపీ మట్టా వీరాస్వామి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, చాగల్లు పార్టీ మండల అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, నందిగంపాడు సర్పంచ్ కుదప రాంబాబు, మాజీ ఎంపీటీసీ చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, నాయకులు గేడా శ్యామ్, అయినం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



చిక్కాలలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న తలారి వెంకట్రావు తదితరులు

మేకప్పచెరువులో చెత్త వేయకుండా చర్యలు చేపట్టండి

వైఎస్సార్ సీపీ నాయకుల డిమాండ్

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామపంచాయతీ పరిధిలోని మేకప్ప చెరువులో పంచాయతీ పారిశుధ్య సిబ్బంది సేకరించిన చెత్తను వేయకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మేకప్పచెరువును వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరిశివకుమార్, పార్టీ నాయకులు కుప్పాల రాంబాబు, కామిరెడ్డి పెదకాపు, బీదం రాజులు రజక సంఘ నేతలతో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతకాలంగా పంచాయతీలోని చెత్తను తీసుకువచ్చి మేకప్పచెరువులో తీసుకువచ్చి వేస్తున్నారన్నారు. దీనివలన రోడ్డుపై మురుగునీరు ప్రవహించడంతో పాటు, చెరువు మూసుకుపోయే పరిస్థితి నెలకొందని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మేకప్పచెరువును వినియోగించుకునేవారన్నారు. కొంతకాలంగా మేకప్ప చెరువును ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారిందన్నారు. చెరువు వద్ద చెత్తవేయడం వలన పరిసర ప్రాంత ప్రజలకు రోగాలు వచ్చే ప్రమాదముందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి మేకప్పచెరువులో ఎటువంటి చెత్తవేయకుండా చర్యలు చేపట్టడంతో పాటు, చెరువును పూర్తి స్థాయిలో బాగు చేయించాలని కోరతామని బొప్పన సుబ్బారావు తెలిపారు.



మేకప్ప చెరువు వద్ద చెత్త వేయడంతో పరిస్థితిని వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఆరుగురు విద్యార్థులకు సహాయం

- ఆరుగురు విద్యార్థులకు స్వర్ణాంధ్ర రాంబాబు సహాయం
- ఆయన సేవలు ఆదర్శనీయం : విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ జితేంద్ర

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ ముఖ్య నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు విద్యార్థుల పేదరికం చదువుకి అడ్డం కాకూడదనే ఉద్దేశంతో తన ఉద్యోగ విరమణ ద్వారా వస్తున్న పెన్షన్‌తో ఏటా ఆరుగురు విద్యార్థులకు సహాయం అందించడానికి ముందుకు రావడం అభినందనీయమని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ మారిశెట్టి జితేంద్ర పేర్కొన్నారు. ఆదివారం స్థానిక లాలాచెరువు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో ఇంజినీరింగ్, మెడిసిన్, ఎంఎల్‌టి, పాలిటెక్నిక్ ఇతర కోర్సులు చదువుతున్న విద్యార్థులకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సహకారం అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుబ్బల రాంబాబుతో కలసి విద్యార్థులకు చెక్కులు అందజేశారు. జితేంద్ర మాట్లాడుతూ రాంబాబు అందిస్తున్న సేవలను స్ఫూర్తిగా తీసుకుని ఇప్పుడు ఆర్థిక సహకారం పొందిన విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చదువుకుని సహాయం చేసేందుకు ముందుకు రావాలన్నారు. కుటుంబ పేదరికం కారణంగా చదువు ఆగిపోకూడదన్న ముఖ్య ఉద్దేశంతో రాంబాబు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చదువు మాత్రమే మనిషిని ఉన్నత శిఖరాలకు తీసుకువెళుతుందని విద్యార్థులు కష్టపడి ఆ స్థాయికి చేరాలని జితేంద్ర ఆకాంక్షించారు. గుబ్బల రాంబాబు మాట్లాడుతూ తనకు వస్తున్న పెన్షన్ ద్వారా ప్రతీ ఏటా 6గురు మెరిట్ విద్యార్థులకు ఈ విధంగా ఆర్థిక సహకారం అందిస్తానని తెలిపారు. బాగా చదువుకునే వారిని ప్రోత్సహించడం ద్వారా మరింతగా వారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు తన వంతుగా ఈ ప్రయత్నం ప్రారంభించినట్టు వివరించారు.

ప్రకృతి వ్యవసాయంపై బ్రెజిల్ బృందం అధ్యయనం



యర్నగూడెంలో వరి చేలను పరిశీలిస్తున్న బ్రెజిల్ ప్రతినిధులు

- జిల్లాకు వచ్చిన బ్రెజిల్ ప్రతినిధులు
- గ్రామాల్లో రెండు రోజుల పర్యటన
- సాగు విధానం, అంతర పంటల పరిశీలన

దేవరపల్లి: ప్రకృతి వ్యవసాయ విధానం, అమలు, వినూత్న పద్ధతులు, రైతు సాధికారతపై బ్రెజిల్, శ్రీలంక, అబూదబీ దేశాలకు చెందిన 29 మంది ప్రతినిధుల బృందం దేవరపల్లి మండలం కురుకూరు, యర్నగూడెం గ్రామాల్లో ఆదివారం పర్యటించింది. రెండు గ్రామాల్లో జుజ్జవరపు సతీష్, గద్దే మునేశ్వరరావు వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి ప్రకృతి వ్యవసాయం పద్ధతులను అధ్యయనం చేశారు. కురుకూరులోని ఆదర్శ రైతు జుజ్జవరపు సతీష్ వ్యవసాయ క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా కొబ్బరిలో అంతర పంటలుగా సాగు చేస్తున్న కోకో, వక్క, పైనాపిల్ తోటలను ప్రతినిధులు పరిశీలించి రైతు నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఐదంచెల విధానంలో పంటలను సాగు చేస్తున్నట్టు రైతు సతీష్ ప్రతినిధులకు వివరించారు. 5 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను గత 10 ఏళ్లుగా పండిస్తూ మంచి ఆదాయం పొందుతున్నట్టు ఆయన తెలిపారు. కోకో ద్వారా ఎకరాకు రూ.2.25 అదనపు ఆదాయం వస్తోందని ఆయన తెలిపారు. గోమూత్రం, జీవామృతం, గణామృతం, కషాయాల తయారీ విధానం గురించి ఆయన వివరించారు. డ్రిప్ ద్వారా జీవామృతం సరఫరా విధానాన్ని ప్రతినిధులు పరిశీలించారు. 1000 లీటర్ల జీవామృతాన్ని 45 నిముషాల్లో 5 ఎకరాలకు డ్రిప్ ద్వారా అందిస్తున్నట్టు రైతు సతీష్ తెలిపారు. అనంతరం రైతు సేవా కేంద్రం వద్ద రైతులతో సమావేశమై ప్రకృతి వ్యవసాయంలో వినూత్న పద్ధతులు గురించి తెలుసుకున్నారు. అనంతరం యర్నగూడెంలోని ఆదర్శ రైతు గద్దే మునేశ్వరరావు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి వరి చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజరు బొర్రా తాతారావు మాట్లాడుతూ బ్రెజిల్‌కు చెందిన అగ్రికల్చర్ మినిస్ట్రీస్, రైతు సాధికార సంస్థ, సహకార సంఘాలు, సీపార్టనర్స్ సంస్థ(ఎన్జీఓ) ప్రతినిధులు 29 మంది రెండు బృందాలుగా ఏర్పడి జిల్లాలో పర్యటిస్తున్నట్టు ఆయన తెలిపారు. పెరవలి మండలం ముక్కామల, కొవ్వూరు మండలం దొమ్మేరు, కాపవరం, దేవరపల్లి మండలం కురుకూరు, యర్నగూడెం గ్రామాల్లో పర్యటించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అధ్యయనం చేసినట్టు ఆయన తెలిపారు. ఆయా దేశాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేయడానికి పరిశీలనకు వచ్చారని, ఇక్కడ చేస్తున్న విధానం ప్రతినిధులకు నచ్చినట్టు ఆయన తెలిపారు. పర్యటనలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవ రావు, కొవ్వూరు ఏడీఏ శ్రీనివాస్, రైతు సాధికార సంస్థ ప్రతినిధి సుధాకర్, అడిషినల్ జిల్లా మేనేజరు వల్లీ, మండల వ్యవసాయాధికారి ఎ. కమల్ రాజ్, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో మహిళల పాత్ర కీలకం

తాళ్లపూడి (కొవ్వూరు): ప్రకృతి వ్యవసాయం అమలులో మహిళల పాత్ర అభినందనీయమని బ్రెజిల్ బృందం ప్రశంసించారు. ప్రకృతి వ్యవసాయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునే క్రమంలో బ్రెజిల్, యూఏఈ, శ్రీలంకకు చెందిన 29 మంది శాస్త్రవేత్తల బృందం రెండో రోజు ఆదివారం కొవ్వూరు మండలంలోని కాపవరం, ధర్మవరం గ్రామాలను సందర్శించారు. ఈ పర్యటన రైతు సాధికార సంస్థ, నౌ భాగస్వాములు సంయుక్తంగా నిర్వహించారు. నౌ పార్టనర్స్ వ్యవస్థాపకులు వాల్టర్ లింక్‌తో పాటుగా బ్రెజిల్ మంత్రిత్వ శాఖకు చెందిన థామస్, మారియో బ్రగా డి తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ నమూనాలు, వినూత్న పద్ధతులు పరిశీలించారు. ఈ మేరకు ఈ వ్యవసాయంలో మహిళల పాత్ర కీలకమని వారు ప్రశంసించారు. కాపవరంలో సత్యనారాయణ నిర్వహిస్తున్న 13 ఎకరాల హార్టికల్చర్ పాలీక్రాపింగ్ క్షేత్రాన్ని సందర్శించి, డ్రాగన్, చెరకు, అరటి, కంద, బొప్పాయి వంటి పంటలను పరిశీలించింది. అనంతరం నాగిరెడ్డి కృష్ణారావు నిర్వహిస్తున్న ఏ గ్రేడ్, ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టమ్ వరిసాగులో అంతర పంటలు తదితర వివరాలను సేకరించారు. పి.గోపాలకృష్ణ నిర్వహిస్తున్న ఎనీ టైం మనీ నమూనాను సందర్శించారు. ఈ పర్యటనలో సిబ్బంది సుధాకర్, జాకీర్, స్వాతి, హుమయున్, ప్రకాష్, హేమ సుందర్, నాగ ప్రమీల రాణి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ తాతారావు, ఉప వ్యవసాయ సంచాలకులు చింతా శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి గంగాధర్ రావు, హార్టికల్చర్ అధికారి రమేష్, కమల్ రాజ్, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



కాపవరంలో ప్రకృతి వ్యవసాయం ద్రావకాలు పరిశీలిస్తున్న బ్రెజిల్, యూఏఈ , శ్రీలంక శాస్త్రవేత్తల బృందం

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు గ్రామం రమాదేవి గార్డెన్స్‌లో ఆదివారం కిమ్స్ బొల్లినేని హాస్పిటల్స్, లైన్స్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించాయి. ఈ శిబిరంలో 200 మందికి కిమ్స్ వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు వజ్రపు కోటేశ్వరరావు, గ్రంధి వెంకటేశ్వరరావు శిబిరం ఏర్పాటు చేసిన హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్వర్ణ రామ్మోహన్, చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎన్ ఎస్ రామరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

పాస్‌పోర్ట్ పోయినది

కొారు నవీన్ S/o దుర్గారావు అను నేను దేవరపల్లి మండలం సుబ్బారాయపురం గ్రామస్తుడ్ని నాకు వైట్ పాస్‌పోర్ట్ కలదు. నా పాస్‌పోర్టు నెం. **X0922309**. నా పాస్‌పోర్టు జిరాక్స్ తీయించడానికి ది.24.09.2025న దేవరపల్లి తీసుకొని వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికిన వారు 97039 43916 అను నెంబరుకు దయతో తెలుపగలరు.